క్లుప్తంగా

నవ్వుతో వ్యాధులు దూరం



గుంటూరు మెడికల్: ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో లాఫ్టర్ యోగ ప్రదర్శన, షుగర్ వ్యాధి చికిత్సలో నవ్వుల పాత్ర అంశంపై సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో లాఫ్టర్ యోగ లీడర్ డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ నవ్వడం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. ఎక్కువ మంది నేడు ఒత్తిడితో బాధపడుతున్నారని చెప్పారు. దీని వలన బీపీ, షుగర్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. హాయిగా నవ్వడం ద్వారా శరీరంలో ఎండార్ఫిన్ విడుదలై ఆందోళన, డిప్రెషన్ తగ్గుతోందన్నారు. గుంటూరులో డాక్టర్స్ స్మైల్ క్లబ్ ద్వారా డాక్టర్ కమల ఆధ్వర్యంలో లాఫ్టర్ యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రామ్‌కుమార్ వెల్లడించారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ



నగరంపాలెం: పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ జీవీ రమణమూర్తి శనివారం అంజదేశారు. అనారోగ్య కారణాలతో ఇటీవల ఎస్ఐ డి.ప్రసాద్‌రావు(ఏఆర్), ఏఎస్ఐ కె.శివశంకరరావు(పెదకాకాని పీఎస్), హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ–డీసీఆర్‌బీ) సీహెచ్ శ్రీనివాసరావు మృతి చెందారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ప్రసాద్‌రావు భార్య రమ్యకృష్ణకు లక్ష రూపాయల చేయూత, వీడియో ఫండ్ రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేలు, శివశంకర్‌రావు కుమార్తె జ్యోతికి లక్ష రూపాయల చెక్కు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును డీపీఓలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి అందించారు. డీపీఓ ఏఓ వెంకటేశ్వరావు, పి.సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి, పోలీస్ అసోసియేషన్ సభ్యులు హుస్సేన్ పాల్గొన్నారు.

మోదీకి ఓటమి భయం

సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

లక్ష్మీపురం: మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి మోదీ కుట్ర చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు. స్థానిక గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లోని వీఎస్‌కే హాల్‌లో శనివారం ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఇన్సాఫ్, అవాజ్ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీడియాను చెప్పు చేతల్లో పెట్టుకుని గెలుపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి., జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు.

ఆకట్టుకున్న శ్రీ కృష్ణార్జున యుద్ధం ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి శ్రీకృష్ణార్జున యుద్ధం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈశ్వర వరప్రసాద పరిషత్ సౌజన్యంతో శ్రీలక్ష్మీ నరసింహ నాట్యమండలి ధర్మపురి ఆధ్వర్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు రచయితగా, డాక్టర్ సంగనభట్ల నరసయ్య దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణుడిగా డాక్టర్ నరసయ్య, అర్జునుడిగా నరహరి శర్మ, గయుడు, సాచ్చకిగా బొజ్జ రాజగోపాల్ శర్మ, నారథుడిగా సంగనభట్ల రామకష్టయ్య పాత్రధారులుగా వ్యవహరించారు. పుడమి గ్రూపు చైర్మన్ ముత్తవరపు సురేష్ మాట్లాడుతూ నాలుగు తరాలుగా ఒకే సంస్థ పౌరాణిక నాటకం ప్రదర్శించడం తెలుగు ప్రేక్షకుల అదృష్టమని అన్నారు. అనంతరం పాత్రధారులను, సాంకేతిక నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల సినీ నటులు, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు, దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ, సెట్లం చంద్రమోహన్ పలువురు పౌరాణిక నాటకాభిమానులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఉద్రిక్తత

లక్ష్మీపురం: రైలులో గో మాంసం సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆయన భక్తులతో కలసి గుంటూరు రైల్వే స్టేషన్‌లో శనివారం నిరసనకు దిగారు. రైల్వే స్టేషన్‌లో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. నిబంధన మేరకు ఇక్కడ పార్సిళ్లు తెరవడం కుదరదని హైదరాబాద్ వెళ్లాలని సర్దిచెప్పారు. రైలును యథావిధిగా పంపించి వేశారు.

జగనన్న గెలుపు ప్రజల కోసమే

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి నూరిఫాతిమా
- 17వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

పట్నంబజారు: రాష్ట్రంలో జగనన్న గెలుపు ప్రజల కోసమేనని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 17వ డివిజన్ గాంధీనగర్, చాకలిగుంట ప్రాంతాల్లో కార్పొరేటర్ ఫర్జానాతో కలసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రతి పేదవాడికి జరిగిన మేలును తన సంతోషంగా భావించే గొప్ప మనస్సున్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద వర్గాలను చిన్న చూపు చూసి కేవలం పెత్తందారులకు మాత్రమే పెద్ద పీట వేసేవారని, అందుకు భిన్నంగా సీఎం జగనన్న పేద వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తన సొంత మనుషులని చాటి చెప్పారన్నారు. కేవలం అర్హతే ప్రమాణికంగా సంక్షేమాన్ని ప్రతి పేదవాడికి అందించి వారి జీవితంలో వెలుగులు నింపారని వివరించారు. అమ్మ ఒడి మొదలు, ఆరోగ్య శ్రీ వరకు, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి మంచి చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యాదాల చిన్న, బికారి, రామ్, అనూఫ్, పద్మ, సాంబ్రాజ్యంలు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా కూరగాయల వ్యాపారికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న నూరిఫాతిమా

వైఎస్సార్‌సీపీలో చేరిక..

తూర్పు నియోజకవర్గంలోని ఐదో డివిజన్, కొత్తపేట రామచంద్రా పిల్లల ఆస్పత్రి సమీపంలో స్థానిక కార్పొరేటర్ యాట్ల రవి, వైఎస్సార్ సీపీ నేత యూసఫ్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ఉరవకొండ అశోక్, దుర్గ, ధర్మ, వారి మిత్ర బృందంతో కలసి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతోందన్నారు. సీఎం జగనన్న సంక్షేమాన్ని చూసి ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గులాం రసూల్, జియావుర్ రెహమాన్, పసుపులేటి రామయ్య, నేరేళ్ల సురేష్, మొహమ్మద్ ఫారూఖ్ పాల్గొన్నారు.



నూరిఫాతిమాకు హారతులు పడుతున్న మహిళ

దాసరి నారాయణరావుకు ఘన నివాళి

లక్ష్మీపురం: సినీ దర్శకుడు డాక్టర్ దాసరి నారాయణరావు చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సినీ దర్శకులు కె.జయకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం దాసరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 44 ఏళ్ల పాటు చిత్ర పరిశ్రమలో కొనసాగి ఎంతో మందికి సినీ జీవితాన్ని ప్రసాదించడంతో పాటు పరిశ్రమకు పెద్ద దిక్కుగా కొనసాగిన దాసరి జయంతిని డైరెక్టర్ డే గా తెలుగు చలన చిత్రం దర్శకులు సంఘం నిర్వహించడం అంటే ఆయనకు ఎంతటి గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. అనంతరం సంస్థ సభ్యులు సినీ రంగ విశ్లేషకులు ఎ.అమరాచారి, సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కో ఆర్డినేటర్ బిళ్లా అశోక్, గాయకులు సాయిబాబు, రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు. రాష్ట్రంలో పెన్షన్ దారులకు పెన్షన్‌ను బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పి రకరకాల కారణాలతో చార్జీలు వసూలు చేయడం దారుణమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు.



దాసరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచంపై ఉన్న వారికి ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేస్తామని చెప్పి బ్యాంకుల్లో జమ చేసి నానా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని అన్నారు. పెన్షన్ దారుల వద్ద ఎటువంటి చార్జీలను వసూలు చేయరాదని, ఇప్పటి వరకూ వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చి వేయాలని డిమాండ్ చేశారు.

కోత కుట్టు లేకుండా పసరతిత్తి నాళంలో రాళ్లు తొలగింపు

- గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల ప్రతిభ
- అభినందించిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: కోత కుట్టు లేకుండా పసరతిత్తి నాళంలో రాళ్లు తొలగించి జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల బృందం ప్రతిభ చాటింది. వివరాలు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన ఆదెమ్మ పచ్చకామెర్లతో ఏప్రిల్ 17వ తేదీన గుంటూరు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి వచ్చారు. రోగికి వివిధ పరీక్షలు చేసి వార్డులో చేర్పించారు. డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్‌బాషా పరీక్షించి పసరతిత్తి నాళంలో మూడు సెంటిమీటర్ల రాళ్లు ఉన్నాయని నిర్ధారించారు. ఈ రాళ్లను ఈ ఆర్‌సీపీ ద్వారా తీయాలని నిర్ణయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వెల్లడించారు. ఏప్రిల్ 24న మత్తు ఇచ్చి బలూన్ ద్వారా విజయవంతంగా రాళ్లను తీశారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో ఈ నెల 5న డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. రోగికి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీద్వారా శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. రోగి ఆరోగ్యవంతంగా ఇంటికి పంపించిన వైద్యులను శనివారం అభినందించారు. చికిత్స చేసేందుకు డాక్టర్ శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు ఎం.పోలయ్య, విష్ణు మహేష్ పాల్గొన్నారు.



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న ఆదెమ్మతో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ నాగూర్‌బాషా

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అప్పగింత

గుంటూరు మెడికల్: ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉన్న ఓ రోగి గుంటూరు జీజీహెచ్‌కు వచ్చింది. చికిత్స అనంతరం రోగికి అవసరమైన వైద్య పరికరం ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను రోగి ఇంటికి జీజీహెచ్ వైద్యులు పంపించారు. ఆరు నెలల అనంతరం రోగి కుదటపడడంతో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను రోగి బంధువులు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళ తండ్రి చంద్ర శేఖర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ను ఇంట్లో ఉంచుకోకుండా తిరిగి ఆసుపత్రికి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధూర పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరి వాస్తవ్యులు లంకా జగదీష్ బాబు, సమ్మ దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు విరాళ నగదు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ, కంప్యూటర్ నైపుణ్యంపై ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 26 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు కడపలో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: లాం కళాశాలలో హైదరాబాదుకు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఇందులో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులుతో పాటు శాంతికిరణ్, శ్రీమన్నారాయణ, రాజేంద్ర, వంశీకృష్ణరాజు తదితరులు అభినందించారు.

ఈవీఎంలు సిద్ధం



పొన్నూరు : ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నియోజక వర్గంలో 264 బూత్‌లలో ఓటింగ్ ప్రక్రియలో వినియోగించనున్న ఈవీఎంలు, వీవీప్యాట్లు సిద్ధమవుతున్నాయి. పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో రిటర్నింగ్ అధికారి ఎ. లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో నిపుణుల పర్యవేక్షణలో ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ అమరిక, వరుస క్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుర్తులను ఏర్పాటులో తలమునకలై ఉన్నారు. ఎన్నికల బరిలో ఉన్న 14 మంది అభ్యర్థుల పర్య వేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు ఆయా మండలాల ఏఆర్వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పనిచేస్తున్నారు.

సంక్షేమ సారథిని గెలిపించుకుందాం

- వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య
- గుంటూరులో వాకింగ్ ట్రాక్‌లో పర్యటన

పట్నంబజారు: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని శ్రీ పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమంలోని వాకింగ్ ట్రాక్‌లో పర్యటించారు. స్థానికులతో కలిసి తిరుగుతూ.. వారితో మమేకమై.. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాకింగ్ ట్రాక్‌కు సంబంధించిన సమస్యలు, ఏదైనా పనులు చేయాల్సి ఉందా అని వాకర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగారన్నారు. ముఖ్య పేద వర్గాలను తన సొంత మనుషుల్లా భావించి పరిపాలనను వారి గడప వద్దకు చేర్చారన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారులు ప్రజలకు వద్దకు వచ్చే పాలనను తీసుకునివచ్చారన్నారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్య దిశగా అడుగులు వేశారన్నారు. అన్నివర్గాలకు మేలు చేసిన జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనని, ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వబ్రాహ్మణుల మద్దతు వైఎస్సార్ సీపీకే



సంఘీభావం తెలియజేస్తున్న సంఘ నాయకులు

నెహ్రూనగర్: విశ్వబ్రాహ్మణుల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుందని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నగర కార్యదర్శి సున్నం మల్లికార్జునరావు పేర్కొన్నారు. శనివారం కాకాని రోడ్డులో విశ్వబ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేశారని కొనియాడారు. పేదలందరికి ఇల్లు, అమ్మ ఒడి ఇతర సంక్షేమ పథకాల ద్వారా విశ్వబ్రాహ్మణులకు ఎంతగానో లబ్ధి చేకూరిందన్నారు. ఇంత మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండేందుకు విశ్వబ్రాహ్మణులంతా స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీ మద్దతుగా ఉంటారన్నారు. విశ్వబ్రాహ్మణుల సంఘీయులు ఎన్ని పార్టీలు వచ్చి ప్రలోభాలకు గురిచేసిన లొంగకుండా సీఎం వైఎస్ జగన్ తిరిగి సీఎం చేసుకోవడంతో పాటు గూంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవడంతో పాటు ఎంపీ అభ్యర్థిని కూడా అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. కూటమికి చెందిన కొంత మంది విశ్వబ్రాహ్మణులు ఎన్నికలు వచ్చిన ప్రతి సారి గుడి పేరు చెప్పుకుని, సంఘాల పేరు చెప్పుకుని లక్షల్లో వసూలు చేయడాన్ని ఖండించారు.

గీతాంజలి చనిపోతే..

బీసీ నేతలు చమత్తి శంకర శాస్త్రి, తూశ్లూరి సూరిబాబు మాట్లాడుతూ తెనాలికి చెందిన విశ్వబ్రాహ్మణ వర్గానికి చెందిన గీతాంజలి ప్రభుత్వం ద్వారా తనకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయని మీడియాతో తన ఆనందాన్ని పంచుకుంటే దానిని జీర్ణించుకోలేక ఆపై సోషల్ మీడియాలో వివిధ రకాలు ట్రోల్ చేసి ఆమెను ఆత్మహత్య చేసుకునే విధంగా చేస్తే అప్పుడు నిరసన తెలియజేయని కూటమి నేతలు... బందర్‌లో జనసేన నాయకుడు కవ్వింపులకు చర్యలకు పాల్పడుతూ కావాలనే కూటమి నేతలు వైఎస్సార్ సీపీ జెండాలు కప్పుకుని దాడికి పాల్పడితే దానికి నిరసన గుంటూరులో నిరసన చేసిన విశ్వబ్రాహ్మణులు.. గీతాంజలి మరణం మీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. విజ్ఞత కలిగిన విశ్వబ్రాహ్మణులు కూటమి నేతలు చెప్పే మాయ మాటలను నమ్మకుండా వైఎస్సార్ సీపీకే తమ సంపూర్ణ మద్దతు తెలియజేయాలన్నారు. సమావేశంలో మేడూరి శివరామకృష్ణ, కందుకూరి లక్ష్మీనారాయణ, బండి నాగరాజు, లింగాల వెంకటరమణ, ఎనుమల మల్లిఖార్జున్, దాసు రామకృష్ణాచారి, పులికొండ బ్రహ్మం, కోట మురళి, చెన్నుపల్లి భాస్కర్, ఎన్.రాంబాబాబు, ఎన్.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలలలసి భర్తను హతమార్చిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. బుచ్చయ్యతోటలో నివాసం ఉండే కుక్కమూరి ప్రేమ్‌కుమార్(30) ఆర్టీసీ బస్టాండ్‌వద్ద పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్, అతడి భార్య భారతితో కలసి మూడేళ్ల క్రితం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో భారతి లాలాపేట ప్రాంతానికి చెందిన గౌస్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గుర్తించిన ప్రేమ్‌కుమార్ పలుమార్లు భారతిని వారించాడు. అయితే వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని, అతడి హతమార్చేందుకు సిద్ధమయ్యారు. గతనెల 28వ తేదీన గౌస్, ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని చెప్పి తీసుకెళ్లి, వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు ఖాళీ స్థలంలో మరో ఇద్దరితో కలసి హతమార్చాడు. అయితే తన భర్తను హతమార్చాలని భారతి, గౌస్‌ను కోరడంతో పక్కా ప్లాన్ చేసుకుని హత్య చేశారు. అనంతరం 28వ తేదీ రాత్రి తన భర్త కనిపించడం లేదంటూ భారతి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కాల్ డేటా ఆధారంగా భారతి, గౌస్‌తో పలు మార్లు ఫోన్ మాట్లాడడాన్ని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అయితే భారతి, హత్యకు పాల్పడిన గౌస్ పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రేమ్‌కుమార్(ఫైల్)

ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో సినీపరిశ్రమ అభివృద్ధి మాత్రమే తమ ముందున్న లక్ష్యమని ఆంధ్ర దర్శకులు వెల్లడించారు. మా–ఏపీ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ నిర్వహించిన దర్శకుల దినోత్సవంలో వారు పాల్గొన్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి రోజును దర్శకుల దినోత్సవంగా మా–ఏపీ నిర్వహించింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు దర్శకులను దాసరి పురస్కారాలతో సత్కరించింది. స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో ఏర్పాటైన సభకు 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. దర్శకరత్న దాసరి నారాయణరావు స్మారక పురస్కారాన్ని అంకురం, మౌనం, శ్రీకారం, చిత్రాల దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత సి.ఉమా మహేశ్వరరావు, 40 సినిమాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు భరత్ పారేపల్లికి బహూకరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్ చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కే మరి కొందరు సినీదర్శకులు 'డాడీ' శ్రీనివాస్, ఓ.సాయి, బి. సోమసుందరం, చలవాది శివప్రసాద్‌లకు మా–ఏపీ గౌరవ సత్కారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో చిత్రీకరించిన సినిమాలకు ప్రభుత్వం లోకేషన్లను ఉచితంగా ఇస్తోందని గుర్తుచేశారు. దర్శకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే రాష్ట్రంలో షూటింగ్‌లు నిర్విరామంగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. వర్ధమాన హీరోయిన్లు దివిజ, మౌనిక రెడ్డి, టీనా చౌదరిని మా–ఏపీ సత్కరించింది.



దర్శకుడు ఉమామహేశ్వరరావుకు దాసరి పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం





సూర్యప్రతాపం

ఎండా కాలం..
భగభగ మండే సూర్యుడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. చల్లని పదార్థాల వైపు శనివారం పరుగుపెట్టారు. గుంటూరు నగరంలో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. మధ్యాహ్నం బయటికి రావాలంటే భయపడిపోయారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు







WALK-IN-INTERVIEW

Walk-in-interview with certificates between
9.00 AM to 12.00 Noon from
Monday (06-05-2024) to Saturday (11-05-2024)

★ Nursery to II : Lady Graduate/D.Ed. Mother Teachers
★ III to V Class : English, Social, Science(Lady Teachers).
★ VI to VII Class : Math, Science
*Salary Negotiable

SRI SATYA SAI IDEAL SCHOOL
Chowtra, Guntur-3, Ph: 0863-2222114

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com